




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గుంటూరు పల్నాడు

గురువారం 23 అక్టోబర్ 2025 - పేజీలు 8




# కల్తీ మద్యం పేరు వినిపిస్తే..

# కఠిన చర్యలు...!

సురక్ష యాప్‌పై అవగాహన కల్పించడాన్ని బాధ్యతగా తీసుకోవాలి

ఎక్సైజ్, స్థానిక యంత్రాంగం, మద్యం దుకాణదారులు, నేతలకు చీఫ్ విప్ జీవీ ఆదేశం

**వినుకొండ మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కల్తీ మద్యం అన్నమాటే వినిపించకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఇకపై కల్తీ మద్యం ఘటనలు ఎక్కడ వినిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కల్తీ మద్యం ఘటనలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడానికి కూటమి ప్రభుత్వం సురక్ష మొబైల్ యాప్‌ను తీసుకొచ్చిందని, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక ఎక్సైజ్ అధికారులు, అధికార యంత్రాగం, మద్యం దుకాణదారులు, నాయకులందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు. అక్రమ మద్యపాన నివారణ కోసం బుధవారం నుంచి ఈ నెల 29 వరకు వారం రోజులపాటు ప్రజా భద్రతా అవగాహన ప్రచారాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రజలందరూ సురక్ష యాప్‌ను ఉపయోగించడం తెలుసుకోవా లని, మద్యం కొనుగోలు చేసే ముందు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అక్రమ, కల్తీ మద్యం వినియోగాన్ని అరికట్టడంలో ప్రజా భాగస్వామ్యాన్ని

వివరాలు 2లో...

## ఈనెల 29న మెగా జాబ్ మేళా

**నరసరావుపేట మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాను ఈ నెల ది:29 (బుధవారం) వ తేదిన ఉ. 09.గం//లకు ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల, కేసనపల్లి, నరసరావుపేట, పల్నాడు జిల్లా నందు జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జాబ్ మేళా యొక్క గోడ పత్రికను కృతిక శుక్ల , కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ కలెక్టర్ కార్యలయం నందు ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పల్నాడు జిల్లా మరియు పరిసర ప్రాంత యువతి యువకులు అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని

2 లో

## పురమిత్ర యాప్‌తో ప్రజలకు మేలు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** పురపాలక సేవలను ఇంటి వద్ద నుండే ఫోన్ ద్వారా పొందడానికి వీలుగా రూపొందించిన పురమిత్ర యాప్ ని గుంటూరు నగర ప్రజలు విస్తృతంగా ఇప్పటికే 25 వేల మంది డౌన్లోడ్ చేసుకున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ, పురమిత్ర యాప్ ద్వారా షుమారు 122 రకాల పురపాలక సేవలను చేతిలోని ఫోన్ ద్వారానే పొందవచ్చన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలను పొందే యాప్ ని నగర ప్రజలు విస్తృతంగా డౌన్లోడ్ చేసుకొని వినియోగిస్తున్నారన్నారు. సేవల కోసం దరఖాస్తులను ఎప్పటికప్పుడు వాటి పరిష్కార స్తితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ కూడా ఉండడంవలన ప్రజలకు తమ సమస్య, లేదా తమ దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి దరఖాస్తు పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉన్నందున సిబ్బంది కూడా భాధ్యతగా వ్యావహరిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలకు పురమిత్ర యాప్ వినియోగం, ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవడంపై అవగాహన కల్గిస్తున్నామని, ఇంకా ఎవరైనా డౌన్లోడ్ చేసుకోకుంటే వెంటనే చేసుకోవాలని కోరారు.

## విలీన గ్రామాల అభివృద్ధికి అడుగులు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** నగరంలో విలీనమై ఎలాంటి మౌలిక వసతులు లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక తూర్పు నియోజకవర్గంలోని గుంటూరు కార్పొరేషన్ విలీన గ్రామమైన బొంతపాడు నుంచి ఏటుకూరు వైపు వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.1.99 కోట్లతో నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గుంటూరు కార్పొరేషన్ గా అవతరించాక చుట్టుపక్కల కొన్ని గ్రామాలు విలీనమయ్యాయని చెప్పారు. అయితే ఆయా గ్రామాలకు గుంటూరు నగరంలో కనెక్టివిటీ కోసం మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విలీన గ్రామాలకు రోడ్ల నిర్మాణం, మంచినీటి సదుపాయం, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులపై దృష్టి సారించామని తెలిపారు. రాష్ట్రంలో అమృత్ పథకం ద్వారా రూ.440 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు. వర్షాల కాలంలో విలీన గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వీటికి శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షాజీలా, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, డివిజన్ అధ్యక్షులు బ్రహ్మసాని శ్రీనివాస్, ఏడుకొండలు, అబ్బాస్ అలీ, శ్రీకాంత్, గోపి, రహమతున్నిసా, సరోజ, హరికృష్ణ, శ్రీను, రాంబాబు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెమ్మసాని చొరవతో ఏపీకి రూ. 665 కోట్లు విడుదల



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తీసుకున్న చొరవ కారణంగా ఉపాధి హామీ పనుల కింద ఏపీకి రూ. 665 కోట్లు విలువైన మెటీరియల్ కాంపోనెంట్ ను కేంద్ర ప్రభుత్వం బుధవారం మంజూరు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కేంద్రం ఈ రూ. 665 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిధులు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల మెటీరియల్ ఖర్చులకు ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో భాగంగా అవసరమైన మెటీరియల్ నిమిత్తం ఈ కాంపోనెంటును గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విడుదల చేశారు. ఏడాదిన్నర కాలంగా ఏపీలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేయించిన వ్యక్తులకు ఈ మెటీరియల్ కాంపోనెంట్ విడుదల దోహదపడుతుంది. ఇందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరులోని నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం వసంతరాయపురం లోని లుర్దుస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సుని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం కేవలం మీ భవిష్యత్తు ను మాత్రమే కాదు, మన దేశ భవిష్యత్తును కుడా ప్రమాదం లోకి నెట్టుతుంది. అని, మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు, మొదట్లో సరదాగా తీసుకునే మత్తపదార్థాలు క్రమేపీ నియంత్రణ కోల్పోయి మత్తుకు బానిసలు అవుతారనిన్నారు అని, చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటరని, క్యేన్సర్, మరియు ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని స్నేహితులు కానీ మరి ఏ ఇతర వ్యక్తులు కానీ మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే కచ్చితంగా వద్దు అని చెప్పాలని, మత్తు పధార్థాలతో బ్రతుకు దుర్భరం చేసుకోవద్దు అని, మత్తుపదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. సరి అయిన అవగాహన లేక మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న వారు ఎక్కువ మంది వున్నారని, ముందుగానే సరి అయిన అవగాహన పెంచుకొని జీవితాలను చక్క దిద్దికోవాలని, అన్నారు ఈ అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు, అనంతరం మదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాము అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు అనంతరం నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ %వీ% కవిత మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను మరియు యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడు లో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని ఈ లాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు మరియు యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన " బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఉచితంగా సంప్రదించవచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 అని అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మీ బాల శౌరి మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల వలన ఎంతో ఉపయోగ పడుతుందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికీ కృతజ్ఞతలు తెలియజేసారు ఈ కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ కో ఆర్డినేటర్ బి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్తీ మద్యం పేరు వినిపిస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

పెంచడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదే సమయంలో మండల స్థాయి నాయకులు కూడా స్థానిక మద్యం దుకాణాలను సందర్శించి ఎక్సైజ్ సురక్ష యాప్ వినియోగం జరుగుతుందా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. ప్రతి మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో తప్పనిసరిగా స్కాన్ చేసి తనిఖీ చేసుకోవాలన్నారు. మద్యం సీసాలపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవడంపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని తెలిపారు. మద్యం దుకాణాలు, బార్లు, ప్రీమియం స్టోర్లు సహా అన్ని లైసెన్స్ ప్రాంగణాల్లో ఏపీఎస్బీసీఎల్ ధ్రువీకృత నాణ్యమైన మద్యం విక్రయాలు మాత్రమే జరిగేలా, నకిలీ మద్యం వస్తే వెంటనే గుర్తించేలా కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను రూపొందించిందన్నారు. కల్తీ మద్యం విక్రయించినట్లు తేలితే.. స్టాక్ స్వాధీనం చేసుకుని మద్యం దుకాణం లేదా బార్‌ను వెంటనే సీజ్ చేసి లైసెన్స్ కూడా రద్దు చేస్తామన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కేంద్రం అనుమతి

**వినుకొండ మేజర్ న్యూస్:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు కేంద్రం తీపికబురు అందించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ పథకం కింద రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించేందుకు కేంద్ర గృహనిర్మాణశాఖ చేపట్టిన ఈ సర్వే గడువు దేశవ్యాప్తంగా రెండు నెలల క్రితమే ముగిసింది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 5 లక్షల మందికిపైగా పేదలు ఇళ్లు లేకుండా ఉన్నారని అధికారులు గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇటీవల నివేదించారు. దీనిపై స్పందించిన సీఎం..వెంటనే కేంద్రానికి లేఖ రాశారు. దీంతో తాజాగా కేంద్రం ఆంధ్రప్రదేశ్లో సర్వేకు ప్రత్యేకంగా అవకాశం కల్పించింది. నవంబర్ 5 వరకు గడువిచ్చింది. అర్హులెవరైనా ఉంటే గృహనిర్మాణశాఖ ఏఈ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

# 23న ఎ.పి.ఎస్.పి.ఎఫ్ క్రీడల ముగింపు వేడుకలు

**గుంటూరు మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఏపీ ఎస్పీఎఫ్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం గురువారం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగాలపూడి అనిత, హెూం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ పాల్గొంటారు. గురువారం ఉదయం 8 గంటలకు నాగార్జున నగర్ లో జరుగుతుంది. ఈ నెల 14వ తేదీన ఏ.పి.ఎస్.పి.ఎఫ్ డైరెక్టర్ జనరల్ డా.సి.యం.త్రివిక్రమ వర్మ ఏ.పి.ఎస్.పి.ఎఫ్ 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలలో వాలీబాల్, బాడ్మింటన్, 100 మీటర్లు, 400 మీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పందేలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో రాష్ట్రంలో గల వివిధ యూనిట్ల నుండి దాదాపు రెండు వందల మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 29న మెగా జాబ్ మేళా




మొదటి పేజీ తరువాయి..

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసిందిగా తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు సుమారు 30 కి పైగా బహుళ జాత కంపెనీలు పాల్గొంటున్నాయి. ఉదాహరణకు టెక్ మహేంద్ర, వి చేంజ్ సోలుషన్స్, ఫ్యూచర్ ఐటీ సోలుషన్స్, ఆక్సిస్ బ్యాంక్, ఆపెక్స్ సొల్యూషన్, బి.ఎస్.సి.పీ.యల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కియా మోటార్స్ మరియు హెట్రో డ్రగ్స్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయి అని తెలియజేసారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు 12,000 %-% 40,000 రూపాయల వరకు ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమనికి పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజి రావు , రామాంజినెయులు, రవీంద్ర నాయక్ మరియు ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల కర్రెస్పాండెంట్ అబ్దుల్ కరీమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ జాబ్ డ్రైవ్ కు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటియఐ, డిగ్రీ, బి.టేక్, డిప్లొమా, ఫార్మసి, మరియు పి.జి విభాగముల వరకు చదువుకున్నటు వంటి 18-35 సం.ల వయసు గల నిరుద్యోగ యువతి యువకులు వారి యొక్క బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు , పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కావాలని, ఈనెల 21వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల, కేసనపల్లి, నరసరావుపేట, పల్నాడు జిల్లా నందు నేరుగా ఇంటర్వ్యూ హాజరు కావచ్చని వారు తెలిపారు. వివరాలకు సంప్రదించవలసిన నంబర్లు: 9160200652, 9642194600, 9573247861, 8121360425, 9100566581, 7702921219 సంప్రదించన్నారు. ఔత్సాహిక యువతి యువకులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration అనే వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోగలరు. మరిన్ని వివరములకు పైన తెలిపిన నంబర్లను సంప్రదించగలరు. గమనిక: రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనటువంటి యువతీ యువకులు జాబ్ డ్రైవ్ జరుగు ప్రదేశం నందు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని తెలిపారు.



# హెూమ్ కంపోస్టుపై మహిళలకు అవగాహన

**తెనాలి, మేజర్ న్యూస్ :** పురపాలక సంఘం ఆధ్వర్యంలో హెూమ్ కంపోస్ట్ పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పట్టణంలోని 7, 8 వార్డులలో ఉన్న అపార్ట్మెంట్లలో హెూమ్ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. మునిసిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధికా రమేష్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లోని చెత్త ఆహార పదార్థాలతో కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ మాలేపాటి హరిప్రసాద్, మునిసిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు సచివాలయం సిబ్బంది, నగరదీపికలు పాల్గొన్నారు.



# దాడి కేసులో నిందితులు అరెస్ట్

**తెనాలి, మేజర్ న్యూస్:** పట్టణంలోని సీఎం కాలనీలో వ్యక్తిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సాంబశివరావు నిందితుల వివరాలను వెల్లడించారు. సీఎం కాలనీలో చిన్నపిల్లలు గొడవ పడుతుండగా సర్ది చెప్పినందుకు షేక్ రెహమాన్ అతని కుటుంబ సభ్యులపై కొందరు యువకులు కొద్దిరోజుల క్రితం దాడికి పాల్పడిన సంఘటన తెలిసిందే. కేసులో ప్రధాన నిందితుడు షేక్ అబ్దుల్ రెహమాన్, అతనికి సహకరించిన గరిక నాంచారయ్య, షేక్ ఆరిఫ్, మొవ్వ తిరుపతి లను అరెస్టు చేసినట్లు చెప్పారు. మద్యం మత్తులో నిందితులు దాడికి పాల్పడినట్లు సీఐ సాంబశివరావు తెలిపారు. ఎస్ఐ కరీముల్లా, సిబ్బంది ఉన్నారు.



# ఎంఏఎం కళాశాలలో ఎన్‌సీసిలో చేరిన విద్యార్థులు

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** స్థానిక కేసనపల్లిలోని ఎంఏఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నందు 2025 26 సంవత్సరానికి సంబంధించి నూతనంగా ఎన్‌సీసిలో చేరేందుకు అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని 23వ ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ అవతార్ సింగ్ హవల్దార్ కిషన్‌ఆధ్వర్యంలో నిర్వహించారు కుమార్ కళాశాలల ఎన్ సీ సి ఆఫీసర్ జే శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఏఎం కళాశాల అధినేత మేదరమెట్ల రామ శేషగిరిరావు స్టూడెంట్స్ ని ఉద్దేశించి ఎన్సిసి లో చేరడం వలన స్టూడెంట్స్కు శారీరిక పరిపక్వత లభిస్తుందని ఎన్‌సీసిలో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు మెడికల్ ఇంజనీరింగ్ లో ఉద్యోగం అదేవిధంగా ఎయిర్ ఫోర్స్ పోలీస్ బిఎస్ఎఫ్ సిఏఎస్ఎఫ్ మొదలైన వాటిలో మొదటి ప్రాధాన్యత లభిస్తుందని స్టూడెంట్స్ కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాచినేని ప్రసాద్ రావు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం స్థాయి పెంచేందుకు చర్యలు



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుండి అందిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారంతో పాటు ప్రజల సంతృప్త స్థాయిని అడిగి తెలుసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా భూపరిపాలన శాఖ ఛీఫ్ కమీషనర్ జి. జయలక్ష్మి కి చెప్పారు. రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం, పేదలకు ఇళ్లస్థలా పట్టాల పంపిణీ, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, జిల్లాల విభజన, తదితర అంశాలపై భూపరిపాలన శాఖ ఛీఫ్ కమీషనర్ జి.జయలక్ష్మి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారం అనంతరం ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకోవాలన్నారు. ఇళ్లస్థల పట్టాలకోసం దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలు అందించాలన్నారు. పేదల గృహాల లేఅవుట్ లలో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి, అందరికీ ఇళ్ళు పథకంలో అర్హులైన వారికి కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లాలో ప్రగతిని సిసిఎల్ఏ కి తెలియజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీజీఆర్ఎస్ దరఖాస్తులోని అంశాలను అధికారులు ధరఖాస్తుదారుని కలిసి వివరాలు తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించడం జరుగుతున్నదన్నారు. దరఖాస్తులు పరిష్కారం అనంతరం పరిష్కార విధానంపై ప్రజల సంతృప్తి స్థాయి ని అడిగి తెలుసుకుంటున్నామన్నారు. పేదల గృహాల లేఅవుట్ లలో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



# సేంద్రీయ పద్ధతిలో భూసారాన్ని పెంపొందించుకోవాలి: అరుణ

**మాచవరం, మేజర్ న్యూస్:** మాచవరం మండల కేంద్రమైన మాచవరం సచివాలయం నందు రైతులకు భూమి ఆరోగ్యం , భూసారం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం లో జిల్లా శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి యం అరుణ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో భూసారాన్ని పెంపొందించుకోవాలంటే పచ్చి రొట్ట పైర్లు, పంట అవశేషాలను కాల్చి వెయ్యకుండా కుళ్ళ బెట్టుకోవాలని తెలిపారు. అలాగే జీవన ఎరువులు వాడకం వలన రసాయన ఎరువుల వాడకం 20% తగ్గుతుందని చెలియచేశారు. మండల వ్యవసాయ అధికారి, మాచవరం కె. రామమ్మ భూసార ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం విస్తరణ అధికారి కరీమున్, వి.ఎ.ఎ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.



# శ్రీశైలం పాలకమండలి సభ్యులను సన్మానించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

**వినుకొండ మేజర్ న్యూస్:** శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన బోడేపూడి వెంకట సుబ్బారావు మరియు శంకర శెట్టి పిచ్చయ్య లు ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు ని వినుకొండ లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోడేపూడికి, పిచ్చయ్యకి ప్రభుత్వ చీఫ్ విప్ జివి అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, డిఎల్‌డిఏ ఛైర్మన్ లగడపాటి వెంకటరావు, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.



# తెనాలిలో ట్రంప్ చిత్రపటం దగ్ధం

**తెనాలి, మేజర్ న్యూస్:** పాలు పాల పదార్థాలు దిగుమతి చేసుకోవాలని సుంకాలు తగ్గించాలని ఒత్తిడి చేయాలని నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ట్రంప్ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. తెనాలి మండలం కంచర్లపాలెం గ్రామంలో అమెరికా అధ్యక్షులు ట్రంప్ నిర్యాణాన్ని వ్యతిరేకిస్తూ ఆయన చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంట దెబ్బతిన్న కానీ వాడితో అయినా కుటుంబాన్ని పోషించుకో వచ్చానే ధీమాతో పాల రైతులు పసుపు పోషణ కావస్తున్నారని ట్రంప్ సుంకాలు దెబ్బతో పాల రైతులు నాశనం అవుతారని తెలిపారు. బ్యాంకులు ప్రభుత్వ సహాయం లేక పాల రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సబ్సిడీ మీద గేదెలకు దాన గడ్డి అందించాలని పశు వైద్యశాలలో డాక్టర్లు సిబ్బంది మందులు కొరత లేకుండా చూడాలని ఆయన కోరారు. గేదెల ధరలు గడ్డి తవుడు దాన ఖర్చులు పెరిగిపోవటం వల్ల పశుపోషణ భారంగా మారి పాలకు గిట్టుబాటు ధర లేక పాల రైతులు కుదేలవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు తెనాలి అయితానగర్ ఉన్నత నేమ్ సీతారామయ్య సరస్వతమ్మ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ప్రథమ జిల్లా మహాసభకు పాల రైతులు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెనాలి ప్రభాకర్ బుల్లా దాసు కోపల్లె నరసింహారావు బుల్లా రమేష్ జయ పాల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్:** నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం నరసరావుపేట మండలం అల్లూరు వారి పాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జగ్గమ్మ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి సీనియర్ నాయకులు పాల్గొని, కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# ప్రసవాల సంఖ్య పెంచాలి

**పెదకూరపాడు మేజర్ న్యూస్:** ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని పల్నాడు జిల్లా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ పద్మావతి సిబ్బందిని కోరారు. బుధవారం మండలములోని తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక చేశారు. గర్భిణీ స్త్రీల గురించి, వ్యాధినిరోధక టీకాలు గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాలు జరిగేటట్లు మోటివేట్ చేయాలన్నారు. సిజేరియన్ ప్రసవాలు తగ్గించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. చిన్న వయసులో బాలికలకు వివాహాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తాళ్లూరు పీహెచ్సీ వైద్యులు పరిమళా పీహెచ్ఎన్ దుర్గా కుమారి, సూపర్వైజర్లు దిలీపు, శ్రీనివాస రావులు, సుభాషిని, ఫార్మసిస్ట్ ధనలక్ష్మి, ల్యాబ్‌టెక్నీషియన్ చైతన్య పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ అభిమానుల వేడుకలు




**గుంటూరు మేజర్ న్యూస్:** స్థానిక రవీంద్రనగర్ ఒకటో లైనులో గల మాతృ శ్రీ ఆర్ఫన్ చిల్డ్రన్ హోమ్ నందు అల్లు అర్జున్ అభిమానులు ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను జరుపుకున్నారు. ఈ వెలుగుల పండుగను ఇలా ఎవరు లేని అనాథ పిల్లలతో చేసుకుని వాళ్లను వేడుకలలో భాగం చేసి వారి ఆనందం చూడటం ఎంతో సంతోషంగా ఉంది అని, ఇందుకు సహకరించిన అల్లు అర్జున్ అభిమానులకు కృతజ్ఞతలు అని అనాథ శరణాలయ నిర్వాహకులు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ నందు జరిగినటువంటి ఇరు రాష్ట్రాల అల్లు అర్జున్ అభిమానుల సమావేశంలో, గుంటూరు జిల్లా నుంచి షేక్ ఫరీద్ భాషా ని రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గాను, కొయ్యగూర విలియం బాబు ని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నియమించారు. అల్లు అర్జున్ చేతుల మీదుగా వీరు నియామక పత్రాలను అందుకున్నారు. గుంటూరు నందు తాము చేస్తున్న వేడుకలను మరియు సేవా కార్యక్రమాలను గుర్తించి తమను రాష్ట్ర కమిటీలో నియమించడం పట్ల గుంటూరు జిల్లా ప్రెసిడెంట్ బాషా , గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విలియం లు ఆనందం వ్యక్తం చేశారు. ఇక ముందు మరింత ఉత్సాహంగా ఒక బాధ్యతగా భావించి గుంటూరు నందు అల్లు అర్జున్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్స్ బాబీ, నాగరాజు మరియు సభ్యులు వంశీ కృష్ణ, మణిదీప్, దాచేపల్లి రమేష్, మాచర్ల మణికంత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల పరిరక్షణపై అవగాహన




**గుంటూరు, మేజర్ న్యూస్** : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు ఎన్టీఆర్ బస్ స్టేషన్ ప్రాంగణం లో గుంటూరు జిల్లా ప్రజా రవాణా దికారి సిహెచ్ విమల అధ్యక్షతన బస్ డ్రైవర్లు, కండక్టర్స్, సిబ్బందికి బాలల పరిరక్షణ పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ పిల్లలను వివిధ రకాల దుర్వినియోగం, దోపిడీ, హింస, నిర్లక్ష్యం, బాల కార్మికులు, బాల్య వివాహాలు వంటి హానికరమైన పరిస్థితుల నుండి రక్షించాలి అన్నారు. బాలలు, యువతను మాదకద్రవ్యాలనుండి రక్షించాలి అని, సమాజంలో అందరం సమానమే అని, ప్రతి ఒక్కరు తమ వంతు భాద్యతగా మాధకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని, మాధకద్రవ్యాల వినియోగం వల్ల నేర ప్రవృతి పెరుగుతుందని గంజాయి, డ్రగ్స్ సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి అందించాలని ఆయన కోరారు. అనంతరం మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను మరియు యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడు లో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని చెప్పారు. ఇలాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు,యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన "బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఉచితంగా సంప్రదించవచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 తెలిపారు. ఈ కార్యక్రమములో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి రమేష్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సాంబశివ, బస్ డ్రైవర్లు, కండక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రానికి పెట్టుబడులు

## చంద్రబాబు విశ్వసనీయత, సమర్థత వల్లే



**యడ్లపాడు, మేజర్ న్యూస్:** విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరి కోసం ఉద్యోగాలు ఎదురుచూసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే దిశగా విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం యడ్లపాడు మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు గ్రామస్తులతో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన కల్వర్టు, పాఠశాల ప్రహరీ, సీసీ రోడ్లను ప్రారంభించిన అనంతరం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్నాడు డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వసనీయత, నిబద్ధతే ఏపీకి బలం అని పేర్కొన్నారులి ఉత్తమ విద్యాబోధనతో రాష్ట్ర విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే లోకేశ్ తాపత్రయం అని ప్రత్తిపాట తెలిపారు. అనంతరం ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు ఓటముల్ని సమానంగా స్వీకరించి, జీవితంలో బాగా రాణించాలి అని పేర్కొన్నారు.

### ఉత్తమ విద్యాబోధనతో విద్యార్థులు ఎదగాలన్నదే లోకేశ్ తాపత్రయం..

గత పాలకుల నిర్లక్ష్యంతో పూర్తిగా నిర్వీర్యమైన రాష్ట్ర విద్యారంగాన్ని తన సమర్థత.. ఆలోచనా విధానంతో లోకేశ్ సరిదిద్దుతున్నాడన్నారు. పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల నియామకంతో విద్యార్థులు ఉత్తమ విద్యాబోధనతో మెరుగైన ఫలితాలు పొందాలని లోకేశ్ తాపత్రయమన్నారు. రైతు, పేదకుటుంబాల నుంచి వచ్చిన ప్రతి విద్యార్థికి ఉన్నతమైన భవిష్యత్ అందించాలన్నదే కూటమిప్రభుత్వ లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహాకారాలతో కూటమిప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోందని, సంక్షేమ పథకాలు అందించడంలో దేశానికే తలమానికంగా నిలిచిందని ప్రత్తిపాటి చెప్పారు.

### ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాల్ని సద్వినియోగం చేసుకొని ఎదగాలి : ఎంపీ లావు

విద్యార్థులు, యువత గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమిని గెలుపుగా మలుచుకోవడం లోనే అసలైన లక్ష్యసాధన ఉంటుందని ఎంపీ లావు కృష్ణదేవరాయలు తెలిపారు. జీవితంలో రాణించాలంటే విద్యార్థులు పరిణి తితో ఆలోచించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకా లు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాల సాధన దిశగా విద్యార్థినీ, విద్యార్థులు ఎదగాలన్నారు. తాము చదువుకుంటేనే తమ జీవితాలు, కుటుంబాలు బాగుంటాయనే నిజాన్ని ప్రతి ఒక్కరూ



గ్రహించాలన్నారు. రాష్ట్రంలోని అవకాశాలు, వనరుల సద్వినియోగం కోసం విరివిగా పెట్టుబడులు వస్తున్నాయని, విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తిచేసుకునే నాటికి మంచి ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని కృష్ణదేవరాయలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, కుర్రా రత్తయ్య, మద్దినేని సుబ్బారావు, పోపురి వెంకయ్య, మద్దూరి శ్రీనివాస రెడ్డి, ముద్దన నాగేశ్వరరావు, జగన్ మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, ఎమ్మార్వో , ఎంపిడివో, పంచాయతీ డి.ఈ, అధికారులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మా బకాయిలను ఇప్పించండి.. కూటమి ప్రభుత్వానికి విన్నపం



**తెనాలి, మేజర్ న్యూస్ :** మాకు రావాల్సిన బకాయిలను ఇప్పించవలసినదిగా కూటమి ప్రభుత్వం మా బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కొలకలూరు గ్రామానికి చెందిన బాధితులు ఈపూరి వెంకట సత్యనారాయణ, సుద్దపల్లి నళిని, రావూరి రత్నారాణి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామ పురవేదిక వద్ద బుధవారం బాధితులు విలేఖరులతో తమ బాధను పంచుకున్నారు. బాధితురాలు సుద్దపల్లి నళిని మాట్లాడుతూ గ్రామంలో డయేరియా సోకిన సమయంలో అప్పటి గ్రామ సెక్రటరీ గుంటూరు కృష్ణమోహన్ కోరిన మీదట రోజువారి చెప్పిన లెక్క మేరకు భోజనాన్ని సమకూర్చానని రూ.2.14 లక్షలు రావాల్సి ఉండగా, దశల వారీగా రూ.1.50 లక్షలు మాత్రమే చెల్లించారని తెలిపారు. ఓచర్ల పిట్ సంతకాలు పెట్టించుకున్నారని బకాయి చెల్లించలేదని దయచేసి బిల్లులు ఇప్పించాలని కోరారు. బాధితుడు ఏపూరి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ డయేరియా సమయంలో అప్పటి సెక్రటరీ కోరిన మీదట 3357 ట్యాంకర్ల నీటిని సరఫరా చేశానని కుదుర్చుకున్న ఒప్పందం చేసుకున్నారన్నారు. ఒప్పందం ప్రకారం రూ.6.47 లక్షలు చెల్లించాల్సి ఉండగా దశలవారీగా రూ.1.30 లక్షలు మాత్రమే చెల్లించారని చెప్పారు. పంచాయతీలో నిధులు డ్రా చేసి కూడా తమకు చెల్లించలేదని, అధికారులు చర్యలు తీసుకొని బకాయిలు చెల్లించాలని కోరారు. బాధితురాలు రావూరి రత్న రాణి మాట్లాడుతూ 2004 నుంచి ఎస్సీ కాలనీలోని గ్రంథాలయంలో లైబ్రరీ అసిస్టెంట్ గా పని చేస్తున్నానని అప్పట్లో కేవలం రూ.800 జీతానికి ఒప్పుకొని పనిచేస్తున్నానని నా జీతం రూ.6 వేలకు చేరిన సమయంలో సర్పంచిగా చొప్పర ప్రీతి వచ్చారని నా జీతాన్ని రూ10 వేలకు పెంచుతానని హామీ ఇచ్చిందన్నారు. అయితే రూ.6వేలు నాకు చెల్లించి, రూ.4 వేలు తను తీసుకుంటానని చెప్పారని ఆరోపించారు. అందుకు అంగీకరించలేదని నన్ను తొలగిస్తున్నట్లు చెప్పి, నాలుగేళ్లుగా జీతం చెల్లించడం లేదని ఇప్పటికీ నేను నా విధులను నిర్వహిస్తూనే ఉన్నానని చెప్పారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బాధితులు పసుపులేటి పిచ్చయ్య, ముత్తె వీరరాఘవయ్య, కోళ్ల కోటేశ్వరరావు, సుద్దపల్లి మోజేష్, పండలనేని శ్రీనివాసరావు, తనిగినీడి శ్రీరామాంజనేయులు, ధూళ్ల వెంకటరామయ్య, మోదుకురి గురుదేవ్, కాలిశెట్టి రమేష్, ధూళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాస మహోత్సవం ప్రారంభం

**మాచవరం, మేజర్ న్యూస్:** కార్తీక మాస మహోత్సవ వేడుకలు భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవాలయంలో ప్రారంభించడం జరిగిందని ,ఆలయ పూజారి బెల్లంకొండ సత్యానంద శర్మ బుధవారం తెలిపారు. కార్తీక మాసం ప్రారంభ రోజు తమ గృహాల్లో పూజా కార్యక్రమం నిర్వహించుకుంటారు. మాచవరం ఆర్యవైశ్యులు తెల్లవారుజామున సంకీర్తన కార్యక్రమం నిర్వహించుకుంటారు. మొర్జంపాడు లోని బుగ్గ మల్లేశ్వర స్వామి దేవాలయంలో, పిన్నెల్లి శివాలయంలో ఈ కార్తీకమాసంలో ప్రతిరోజు దేవాలయంలో స్వామివారికి వివిధ రకాల పంచామృతాలతో అభిషేకాలు ఆయా దేవాలయ పూజారులు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి వివిధ రకాల అలంకరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు ఆలయ ధర్మకర్త వంకాయల బుగ్గయ్య దత్తకుమారుడు వంకాయల కాశీ విశ్వనాథం, వంకాయల రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్తీక మహోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ఏకాదశ రుద్ర వారాభిషేకం నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనవచ్చునని తమ తమ గోత్రాలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు 1950 సంవత్సరంలో ఈ దేవస్థానాన్ని గ్రామక్షేమం కోసం ఆనాటి వంకాయల బుగ్గయ్య, దేవాలయం నిర్మాణం చేపట్టారని పూజారి అన్నారు ఈ కార్తీక మాసంలో స్వామివారికి అభిషేకాలతో పాటు ప్రతిరోజు కార్తీక దీపాలు వెలిగించి తమ జీవితాలు ధన్యం చేసుకోవాలని ఆ శివ అనుగ్రహం పొందాలని పూజారి కోరారు. దేవాలయంలో ప్రతిరోజు అమ్మవారికి స్వామి వారికి వివిధ రకాల పూల అలంకరణలు దాతల సహాయంతో ప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

## టిడ్కో గృహాల లబ్ధిదారులకు తీపికబురు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 200 టిడ్కో ఇళ్లు అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తి చేసుకొని, లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధమయ్యాయి. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ చర్యలకు చేయూతనిచ్చారు. అక్టోబరు 23న ఈ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. బుధవారం డాక్టర్ చదలవాడ అరవింద బాబు టిడ్కో హౌసింగ్ కాలనీని సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో టిడ్కో కాలనీలను సకల సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరలో ఇళ్లను అప్పగిస్తామని, కోర్టు కేసుల్లో ఉన్న 270 ఇళ్ల విషయంలో సానుకూల నిర్ణయం త్వరలో వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, రుణాలు మంజూరు కాని 300 మంది లబ్ధిదారులకు బ్యాంకులతో క్యాంపులు ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయించి ఇళ్లు అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉన్న ఇళ్ల ప్రక్రియను అక్టోబరు 23 నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వంలో టిడ్కో కాలనీ అభివృద్ధి వేగవంతం కానుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నేతలు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం లెక్కింపు



**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం నందు హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. కానుకులను లెక్కింపు చేపట్టగా ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కోగంటి సునీల్ కుమార్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి గుంటూరు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాసులు పర్యవేక్షణలో దేవస్థానం ట్రస్ట్ దేవ భక్తుని రంగప్రసాద్, ఆలయ అర్చకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళలు, భక్తులు దేవస్థానం సిబ్బంది, పాల్గొన్నారు. ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాణ అధికారి కె. సునీల్ కుమార్, ట్రస్ట్ దేవ భక్తుని రంగప్రసాద్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు సంఘాలుగా ఏర్పడి అభివృద్ధి సాధించాలి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేటలో మత్స్యకారులు సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పల్నాడు జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు పిలుపునిచ్చారు. బుధవారం నాడు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నరసరావుపేట బరంపేటలో గల సాధికార భవనంలో ప్రభుత్వ అధికారులు, రైతులు పాల్గొన్న ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి గుంటూరు%-%పల్నాడు జిల్లాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు సంజీవరావు మాట్లాడుతూ పంటలు పండని భూములను చెరువులుగా మార్చి చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీతో చేప పిల్లలను ఉచితంగా అందజేస్తోందని, ప్రస్తుతం జిల్లాలో 35 మత్స్యకారుల సొసైటీలు ఉన్నాయని, మరికొందరు కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ సబ్సిడీలను వినియోగించుకోవాలని సూచించారు రాష్ట్ర కోఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను ప్రభుత్వ అధికారుల సమక్షంలో పరిష్కరించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు మారుతున్న వ్యవసాయ పరిస్థితుల దృష్ట్యా పంటల మార్పిడి పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని, ఆర్గానిక్ పంటల సాగు ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు పల్నాడు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె .అమల కుమారి మాట్లాడుతూ మనిషి ఆరోగ్యానికి నేల ఆరోగ్యం బలమైన సంబంధం కలిగినది. ఆర్గానిక్ పద్ధతిలో పండించిన పంటలు, ఆకుకూరలు, కూరగాయలు అధిక పోషక విలువలను కలిగి ఉంటాయి. జీవామృతం, ద్రవ జీవామృతం, ఘనామృతం వంటి బయో ఉత్పత్తులు నేల సూక్ష్మజీవుల పెరుగుదలకి, పంటల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి అని తెలిపారు జీవవైవిధ్యం, స్థానిక విత్తనాల వినియోగం, రసాయన రహిత పద్ధతులు, కషాయాలు, బయో ద్రావణాలు, ఫిష్ అమైనో యాసిడ్, ఎగ్ అమైనో యాసిడ్ వంటి పదార్థాల వినియోగం ద్వారా పంటల దిగుబడులు పెరిగే అవకాశముందని వివరించారు ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. భవిష్యత్తు తరాల కోసం ఆర్గానిక్ వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలి” అని రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, జెడ్బీఎన్ఎఫ్ మార్కెటింగ్ ఎన్ ఎఫ్ ఏ ఎం. మేరీ, డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్ సాంబయ్య తోకల, గడ్డిపర్తి కోటి రత్నం తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 60 మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం దేశంలో తీవ్ర ప్రభావం

**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశం తో సహా ప్రపంచ దేశాల్లో తీవ్ర ప్రభావం చూపుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. దుగ్గిరాల గ్రామంలోని. బోసు బొమ్మ సెంటర్లో. బుధవారం నిరసన తెలిపి మాట్లాడుతూ ట్రంప్ ఏప్రిల్ 5వ తేదీన ప్రపంచ దేశాల అన్నిటిపై దిగుమతి సుంకాలు అపరిమితంగా పెంచాడని, రష్యా నుండి ఆయిల్ ఆయుధాలు కొంటున్నామని భారతదేశంపై ఎక్కువ శాతం సుంకాలు పెంచారని తెలిపారు. భారతదేశంపై అధిక శాతం సుంకాలు. పెంచడానికి, దేశాన్ని సర్వనాశనం చేయడం కోసమే ట్రంప్ ఎత్తుగడ అన్నారు . పలు దేశాలు అమెరికా వాణిజ్య యుద్ధాన్ని ఖండించి అమెరికాపై ప్రతిగా శుంకాలు విధించాయని, గట్టిగా ప్రతిఘటించిన పలు దేశాలతో అమెరికా రాజీ పడిందని తెలిపారు .భారత నుండి ఎగుమతి చేసే టెక్స్టైల్స్ దుస్తులు, రొయ్యలు ,చేపలు ఇతర సముద్ర ఉత్పత్తులు అన్నింటి పైన ట్రంప్ సుంకాలు విధించాడని తెలిపారు .మరోవైపు వ్యవసాయ ఉత్పత్తుల మీద సుంకాలను కూడా ఎత్తివేయించి ,భారత మార్కెట్లను అమెరికాతో నింపేయాలనేది ట్రంప్ ఉద్దేశ్యం అని తెలిపారు. అమెరికా విధానాలకు నిరసనగా ట్రంప్ చిత్రపటాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బ్రహ్మేశ్వర రావు, ఎన్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి



**తెనాలి, మేజర్ న్యూస్:** రైతు నష్టపోకుండా మద్దతు ధరలకు సక్రమంగా ధాన్యం కొనుగోలు జరగాలని డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్వర్యంలో తెనాలి మార్కెట్ యార్డ్ లో ధాన్యం సేకరణపై అవగాహన, శిక్షణ సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రినాదెండ్ల మనోహర్ , ఎమ్మెల్సీ ఆలపాటి రాజా సహకారంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కార్యక్రమం సక్రమంగా నిర్వహిస్తోందని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు, రైతు నష్టపోకూడదని ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం ఎంఎస్పీ రేటుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు జరగాలని సూచించారు. కొనుగోలు చేసే ధాన్యంలోని తేమ శాతం సరిచూసి మాత్రమే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ 2025-26కు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరలు ప్రకారం సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్ కు రూ. 2,369, ప్రతి 75 కిలోల బస్తాకు రూ. 1,777, గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్ కు రూ. 2,389, బస్తాకు రూ. 1,792 నిర్ణయించబడినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ ఎండీ కె తులసి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హర గోపాల్, తెనాలి, కొల్లిపర,దుగ్గిరాల, తాసిల్దార్ కె గోపాలకృష్ణ, జీ సిద్దార్థ్, సునీత, సహాయ వ్యవసాయ సంచాలకులు తెనాలి ఇంచార్జ్ ఆర్.విజయ బాబు, వ్యవసాయ అధికారులు కె.సుధీర్ బాబు కె. శ్రీనివాసరెడ్డి , టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఆపేటర్ లు పాల్గొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగాప్రత్యేక పూజలు

**నకరికల్ మేజర్ న్యూస్:** నకరికల్లు మండలంలో నర్సింగపాడు గ్రామంలో శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం నందు వైభవంగా ప్రారంభమైన కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని .ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్ శర్మ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజు దేవాలయం నందు స్వామి,అమ్మవార్లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు అభిషేకాలు నిర్వహించటం జరుగుతుందని స్వయంభువుగా ఉన్న ఈ క్షేత్రానికి ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని ఆయన తెలిపారు. ఈ మాసం మొత్తం స్వామి వారికి ప్రతీ రోజూ విశేషంగా పూజలు,అభిషేకాలు, హెూమాలు తో పాటు అమ్మవారికి కుంకుమపూజలు జరుగుతాయని అన్నారు.





## కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఆనందం ఉంది

**గుంటూరు, విద్య మేజర్ న్యూస్:** మానవసేవే మాధవసేవ,శుద్ధపల్లి రవీంద్ర కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న ఆనందం మరి దేనిలో లేదని సుద్ధపల్లి రవీంద్రబాబు అన్నారు. ఈనెల 12న గుంటూరు ప్రభుత్వ, ఏసీ కాలేజీ రోడ్డు నందు 70 సంవత్సరాలు గల వృద్ధుడు దీనస్థితిలో ఉండటం చూసి ఈ విషయాన్ని మదర్ తెరిసా సిస్టర్స్ కు తెలియజేసి ఆశ్రమం కల్పించినట్లు తెలిపారు. ఇటువంటి నిర్భాగ్యులను, నిరాశలను, అనాథలు వృద్ధులను ఆశ్రమంలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ ఇప్పటివరకు 286 మంది వృద్ధులు, నిరాశ్రయులు ఆశ్రమంలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ దేవి రెడ్డి,కిరణ్మయి పాల్గొని అభినందించినట్లు తెలిపారు.

## సత్ సాంప్రదాయాలను కొనసాగిద్దాం



**సత్తెనపల్లి , మేజర్ న్యూస్:** షిరిడి సాయిబాబా దేవాలయ సంఘం అధ్యక్షులు చల్లా రత్తయ్య ఆధ్వర్యంలో శివశంకర ఏజెన్సీ, ఆత్మకూరి వి.వి రామాంజనేయులు పెయింట్ షాపులో ఇటీవల సత్తెనపల్లి ఏ.జి. కె. ఎమ్ .వాకర్స్ క్లబ్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారము చేసిన కాపుగంటి రత్తయ్యకు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు ఉపాధ్యక్షులు గా ప్రమాణస్వీకారం చేసిన అన్నం మురళీ శ్రీనివాస్ కు , దివ్వెల శ్రీనివాసరావు కు చిరు సత్కారం గావించారు.అన్నం మరియు దివ్వెల కు కుల పరమైన పదవి వచ్చినప్పటికీ పట్టణంలో వీరికి కుల , మతాలకు అతీతంగా చిరు సత్కారం గావించటం సత్తెనపల్లి యొక్క మంచి సంప్రదాయం అని నిరూపిస్తున్నారు అని అన్నారు.దీనితో మాపై ఇంకా బాధ్యతలు పెరిగాయి అని అన్నం మురళీ శ్రీనివాస్, దివ్వెల శ్రీనివాసరావు లు అన్నారు. ఈ కార్యక్రమంలో వి.వి. రామాంజనేయులు, న్యాయవాదులు మర్రి వెంకట సుబ్బారెడ్డి, రాజవరపు శివ నాగేశ్వరరావు,పుట్టి సాంబశివరావు,పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, చిలకల శ్రీనివాసరావు, బచ్చు మోహన్ , యువ న్యాయవాది దేవరశెట్టి శరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్రను జయప్రదం చేయండి




**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్చాపురం నుండి హిందూపురం వరకు నిర్వహిస్తున్న బస్సు యాత్రలో వేలాదిగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఎం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బస్సు యాత్రకు సంబంధించిన గోడ ప్రతులను ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో రాకముందు విద్యార్థులకు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవటం లేదని అన్నారు. పి పి పి పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారని, యూనివర్సిటీలను పట్టించుకోవటం లేదని, విద్యార్థుల హక్కులను హరించే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో జూనియర్ కాలేజీ తోపాటు పాలిటెక్నిక్, డిగ్రీ చేయాలని, సంక్షేమ హాస్టల్ లో వసతులు మెరుగుపరచాలని, విద్యార్థులకు ఫీజు, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రలు అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు మధు, హర్ష, శ్రీనివాసరావు, హేమంత్ కుమార్, సమీర్ భాష, జాన్ పాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఎస్.ఆర్.శంకరన్ సేవలు స్ఫూర్తిదాయకం



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఎస్.ఆర్. శంకరన్ సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఎస్.ఆర్.శంకరన్ జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం వారం నిర్వహించారు. ఎస్.ఆర్.శంకరన్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలాంకరణ చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శంకరన్ అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలతో కలిసిమెలిసి పని చేసిన వ్యక్తి అన్నారు. **"ప్రజల అధికారి"**గా ప్రసిద్ధి చెందారని, ఆయన నిస్వార్థ సేవా భావం, అప్రతిహత సత్యనిష్ఠ వల్ల ప్రజల అధికారిగా మన్ననలు పొందారన్నారు. శంకరన్ ఎస్.సిలు, గిరిజనులు, పేదలు తదితర అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేశారని, సామాజిక న్యాయం కోసం కృషి చేసారని కొనియాడారు. బానిసత్వ నిర్మూలన చట్టం అమలులో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో **"శాంతి దూత"** అని కూడా పిలిచేవారని ఆమె పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పటికీ అతి సాధారణ జీవన శైలి అవలంబించారని తెలిపారు. పదవీ విరమణ తర్వాత కూడా ప్రజా సేవలోనే కొనసాగిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన వ్యక్తిత్వం, సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలపాడు లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం హయాంలో మాచర్ల నియోజకవర్గ ప్రజలు గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని చూస్తున్నారని టిడిపి యువ నాయకుడు జూలకంటి సాయివివేకానందరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు వివేకానందరెడ్డి, టిడిపి యువ నాయకుడు జూలకంటి అక్కిరెడ్డి, మండల నాయకులు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో రహదారులు, నీటి వనరులు, విద్యుత్, విద్యా రంగాల్లో వేగవంతమైన మార్పులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు నర్రా గురువారెడ్డి, కేసిరెడ్డి హనిమిరెడ్డి, మల్లికార్జునరావు, దొండపాటి శ్రీను, ఉప్పలపాడు గ్రామ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాడికొండ శివారు కాలనీ శుభ్రపడింది



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** తాడికొండ గ్రామపంచాయతీ పరిధిలో శివారు కాలనీతో పాటు అనేక ప్రాంతాల్లో గురువారం శుభ్రం చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తెలిపారు. దిన పత్రికలు కూడా తమను జాగృతం చేస్తున్నాయని, ఎక్కడ సమస్య ఉన్న తమ దృష్టికి తెస్తే వెంటనే పరిస్కార మార్గం చూస్తామని చెప్పారు. అలాగే గ్రామపంచాయతీ కార్యదర్శు లకు తక్షణం ఆదేశాలు జారీ చేశామని, ఆ మేరకు వెంటనే చర్యలు చేపట్టి తాడికొండ గ్రామపంచాయతీ శివారు కాలనీలలో శుభ్రపరచడం జరిగిందన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనం మరమ్మతులకు గురి కావడంతో రోజు వారి చెత్త సేకరణలో కొంత జాప్యం జరుగుతోందని, వాటిని త్వరలో మరమ్మతులు పూర్తి చేసి రోజువారి చెత్త సేకరణ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ చెత్త సేకరణ చేస్తున్నారని, విద్యుత్ దీపాలు సక్రమంగా నిర్వహించుటకు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తమ సిబ్బందిని అలర్ట్ చేయడం జరుగుతుందని వెల్లడించారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి పాఠశాల కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలని పాఠశాల కమిటీ సభ్యులు కోరారు. గుంటూరు శివారు అంకిరెడ్డిపాలెం జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వడ్లమాను మహిత, పి. దీప్తి లు ఇటీవల చిలకలూరిపేట ఏ ఎం జి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యస్. జి. ఫ్ అండర్-14 ఉమ్మడి గుంటూరు జిల్లా బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచినారు. ఈ నేపథ్యంలో నవంబ ర్ మొదటి వారంలో చిత్తూరు జిల్లా మదనపల్లె జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రధానోపాధ్యా యురాలు చావలి సరోజిని ఆధ్వర్యంలో బుధవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఇటీవల ఏటుకూరు జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన పాఠశాల క్రీడాకారులను, రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, ఫిజికల్ డైరెక్టర్ గంగిరెడ్డి నాగిరెడ్డి ని గ్రామ పెద్దలు సత్కరించి అభినంద నలు తెలియజేసినారు. మన పాఠశాల క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి మాట్లాడు తూ... చదువుతో పాటు క్రీడల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు విద్య, ఉద్యోగ రంగాల్లో మంచి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొంటూ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహ కాలను అందజేశారు. కళాశాల ఇంచార్జి రామచంద్ర రావు మాట్లాడుతూ... ఇటీవల కాలంలో పాఠశాల విద్యా ర్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం సంతోషంగా ఉందన్నారు. విశ్రాంత అధ్యాపకుడు వీర గంగాధర రెడ్డి మాట్లాడుతూ... ఈ ఏడాది పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు విద్యాపరంగానూ క్రీడారం గంలోనూ మంచి ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు హనుమంతరావు, శ్రీనివాస రావు, ధర్మరాజు, ఫిజికల్ డైరెక్టర్ నాగిరెడ్డి విశ్రాంత అధ్యాపకుడు దేవగిరి వీరగంగాధర రెడ్డి కమిటీ సభ్యులు కుర్రి పుల్లారెడ్డి, విద్యార్థులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

## లూలు కి కేటాయించిన భూములను రద్దు చేయాలి



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** లూలు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు విశాఖపట్నంలో బీచ్ రోడ్డు లో హర్బర్ పార్క్ లో కేటాయించిన 13.74 ఎకరాలు, విజయవాడ నడిబొడ్డులో ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల భూమిని వెం టనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ లో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గుజరాత్ లోని అహ్మదాబాద్ నగరంలో సర్దార్ పటేల్ రింగ్ రోడ్ వద్ద ఉన్న 66 వేల 168 చదరపు మీటర్ల స్థలం దాదాపు 16.35 ఎకరాలను లు లు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ ప్రైవేట్ లిమిటెడ్ వేలంలో 519.41 కోట్లకు, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కొనుగోలు చేసిందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో లూలు సంస్థ దాదాపు 4 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడా నికి సిద్ధమౌతున్నా గుజరాత్ ప్రభుత్వం ఒక సెంటు భూమి కూడా కేటాయించ లేదన్నారు. లులు సంస్థ ఆంధ్రప్రదేశ్ లో 1000 కోట్ల రూపాయలు విశాఖ, విజయవాడలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధపడితే 1000 కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన భూములను దారాదత్తం చేస్తుందని విమర్శించారు. గత 16 నెలలుగా వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను కారు చౌకగా అభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని సంవత్సరానికి 9 లక్షల కోట్ల కు పైగా లాభాలను గడిస్తున్న గూగుల్ సంస్థలకు 22 వేల కోట్ల రూపాయల విలువ గల రాయితీలను ప్రకటించందని మరోవైపు 5 వేల కోట్ల రూపాయల పెట్టుబడిని పెట్టలేని దీనస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెబుతూ 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో కార్పొరేట్ ఆసుపత్రులకు కట్టపెట్టాలని చూస్తుందని దుయ్యబట్టారు.

## ఈనెల 27న వెల్దుర్తికి సీఎం చంద్రబాబు రాక



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు జూలకంటి గౌతమ్ రెడ్డి వివాహ మహోత్సవ రిసెప్షన్ వేడుకలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. వెల్దుర్తి టిటిడి కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రాంగణంలో ఈ నెల 27న మధ్యాహ్నం ఘనంగా రిసెప్షన్ వేడుక జరగనుంది. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, విశిష్ట అతిథులు పాల్గొననున్నారని సమాచారం. చంద్రబాబు పాల్గొననున్న కార్యక్రమానికి సంబంధించి సీఎంవో కార్యాలయం బుధవారం అధికారికంగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో వెల్దుర్తిలో భద్రతా ఏర్పాట్లు, వేదిక సిద్ధత, అతిథుల స్వాగతం వంటి పనులను టిడిపి శ్రేణులు ముమ్మరంగా ప్రారంభించాయి.

## ఎం ఎస్ పి రేట్లకు ధాన్యం కొనుగోలు చేయాలి



**గుంటూరు మేజర్ న్యూస్ :** ఆరుగాలాలు కష్టించి పంట పండించిన రైతు నష్టపోకూడదు. రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది అని డిసిఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు అన్నారు. బుధవారం తెనాలి మార్కెట్ యార్డ్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ పై అవగాహన, శిక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హరిబాబు నాయుడు మాట్లాడుతూ... ప్రస్తుత ఖరీఫ్ సీజన్ 2025-26కు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరలు (ఎం.ఎస్.పి) ప్రకారం - సాధారణ రకం (కామన్) ధాన్యానికి రూ.2,369 ప్రతి క్వింటాల్ (అంటే రూ.1,777 ప్రతి 75 కిలోలకు), గ్రేడ్ 'ఏ' రకం ధాన్యానికి రూ.2,389 ప్రతి క్వింటాల్ (అంటే రూ.1,792 ప్రతి 75 కిలోలకు)గా నిర్ణయించబడినట్లు హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ ఎండీ కె తులసి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హర గోపాల్, తాసిల్దార్ కె గోపాల కృష్ణ, డీఎస్ఓ, తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, జీ సిద్దార్థ్, ఐ సునీత, వ్యవసాయ అధికారులు, పాల్గొన్నారు.

## శివునికి కార్తీక మాసం పూజలు ప్రారంభం

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక మాసం మొ దటి రోజు బుధవారం శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లాలుపురం లోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక అలంకారాన్ని ఏర్పాటు చేశారు. నల్లపాడు, పొత్తూరు, తురకపాలెం, వెంగలయపా లెం, ఏటుకూరు, పెద్ద పలకలూరు, చిన్న పలక లూరు, మల్లవరం గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారా యి. మహిళా భక్తులు దీపారాధనలు చేసి స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు.



# జూటు పంట ఉత్సాహం - కందిలో పురుగు ఆందోళన



**దుర్గి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దుర్గి మండలం ఓబులేసునిపల్లె గ్రామంలో జిల్లా ఏరువాకా కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నగేష్, ప్రధాన శాస్త్రవేత్త విస్తరణ విభాగం పి.వి. సత్యగోపాల్ పంటల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని కంది మరియు జూటు పంటల స్థితిని పరిశీలించారు. జూటు పంట మంచి ఆరోగ్యకరమైన స్థితిలో ఉందని వారు సంతోషం వ్యక్తం చేశారు. అయితే కంది పంటలో గూడు కట్టు పురుగు తీవ్రత కనిపిస్తోందని పేర్కొన్నారు. పురుగు నివారణకు లీటరు నీటికి 1 ఎంలీ క్లోరిపైరిఫాస్ మందును కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.




అలాగే, పూత దశలో వేప గీజల కషాయం లేదా వేప నూనె 10,000 పీపీఎం 200 ఎంలీ లేదా 1,000 పీపీఎం అయితే 400 ఎంలీ ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. కాయ దశలో నావల్యూరాన్ మందును 400 ఎంలీ ఎకరాకు పిచికారీ చేస్తే మంచి దిగుబడి పొందవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై. అమీర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు టీ. దిప్లిప్ చందు, అశోక్, అలాగే గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్లు అంటే గౌరవం లేదా...???







**వినుకొండ మేజర్ న్యూస్ :** గాంధీ విగ్రహం శిలాఫలకంపై కౌన్సిలర్ల పేర్లు ఎందుకు ప్రచురించలేదు...!!! పెట్రోలు బంకు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డివైడర్ వల్ల ట్రాఫిక్ కు అంతరాయం, ప్రజలు తీవ్ర ఇక్కట్లు నరసరావుపేట రోడ్డులో ఇరువైపుల అక్రమణలు తోలగించకుండా... డ్రైనేజీ లు, డివైడర్ల నిర్మాణం ఎందుకు...??? అక్రమణలు తోలగించడంలో అధికారులు విఫలం చేందారని... కౌన్సిలర్లు విమర్శలు వినుకొండ పురపాలక సంఘం సాధారణ సమావేశం ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన నిర్వహించారు... ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల పెట్రోలు బంకు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డివైడర్ వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని... ఇరువైపులా అక్రమణలు తోలగించకుండా, డివైడర్, డ్రెయినేజీ నిర్మించి ఏమి ప్రయోజనమని అధికారులను ప్రశ్నించారు, పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న అక్రమణలు తోలగించడంలో అధికారులు విఫలం చేందారని విమర్శించారు. అక్రమణల తోలగింపులో బాగం అంటూ ఏంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మ గాంధీ విగ్రహాన్ని తోలగించారు... ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో, 4 లక్షల రూపాయల మున్సిపల్ నిధులతో నూతన విగ్రహం ఏర్పాటు చేసారు, శిలాఫలకం పై కౌన్సిలర్ల పేర్లు ఎందుకు వేయలేదని... కౌన్సిలర్లు అంటే గౌరవం లేదా అని అధికారులను ప్రశ్నించారు... మహాత్మ గాంధీ అందరి వాడని ఏ ఒక్క వర్గానికి చెందిన వాడు కాదని, గాంధీ ని గౌరవించుకోవడం మనందరి బాధ్యతని, అందుకని గాంధీ కాంస్య విగ్రహాన్ని మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు కోరారు.

## ఆక్రమణలలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఆక్రమణలలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గుంటూరు రెవిన్యూ డివిజన్ రెవిన్యూ అధికారుల సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. సర్వే నంబర్ల వారీగా ఆక్రమణలు గుర్తించి, వాటి జాబితా రూపొందించాలన్నారు. రెవిన్యూ, సర్వే శాఖల సిబ్బంది బృందాలుగా ఏర్పడి క్షుణ్ణంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. కోర్టు కేసులు ఉన్న స్థలాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో సమర్పించిన అర్జీల పట్ల స్పష్టమైన విచారణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అంశాలను సైతం సిద్ధం చేయాలని సూచించారు.

**ప్రజలకున్న రెవిన్యూ సమస్యలను పరిష్కరించండి..**

రెవిన్యూ సమస్యల పట్ల ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కారాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పి.జి.ఆర్.ఎస్ తో వచ్చే ప్రతి సమస్యను హృదయ పూర్వకంగా అవగాహన చేసుకుని, వారి స్థానంలో ఆలోచించి వాస్తవ పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలను ఇబ్బందులకు ఉద్దేశ్య పూర్వకంగా గురి చేస్తున్నట్లు దృష్టికి వస్తే చర్యలు తప్పవని అన్నారు. నిర్దేశిత సమయంలో సమస్యలు పరిష్కారం కావాలన్నారు. మ్యుటేషన్ లో ఎటువంటి పిర్యాదులు ఉండరాదని అన్నారు. నిర్దేశిత విధానంలో నోటీసులు జారీ చేసి, పక్కాగా విచారణ చేయాలని ఆదేశించారు. గ్రామ సభల నిర్వహణ సమాచారం కూడా పక్కాగా ముందస్తుగా ఇవ్వాలని చెప్పారు. వి.ఆర్.ఓ లు, సర్వేయర్లు గ్రామ సభల నిర్వహణలో సక్రమంగా చేపట్టే విధంగా పర్యవేక్షణ జరగాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ రానున్న ధాన్యం సేకరణలో పూర్తి సహకారం అందించాలని అన్నారు. వ్యవసాయ ఎరువుల పంపిణీని పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, విజయ లక్ష్మి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నూరు శాతం చెత్త సేకరణ జరగాలి



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** గ్రామాల్లో నూరు శాతం ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరగాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీ సాయికు మార్ సూచించారు. గుంటూరు రూ రల్ మండలం చల్లవారిపాలెం గ్రామంను బుధవారం ఆయన సంద ర్శించారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ నుండి ఫోన్లు ద్వారా ఇంటీ పన్నుల డిమాండ్ నోటీసులు ఇంకనూ వెళ్ళనటువంటి వాటిని పరిశీలించారు. అనంతరం గ్రామంలో డ్రై వేస్ట్ కలెక్ట్ చేస్తున్న స్వచ్ఛ రథమును పరిశీలించడం జరిగినది. చెత్త సేకరణపై పంచాయతీ సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడ మైనది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కే శ్రీనివాసరావు, చల్లావారిపాలెం పంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## భర్మా వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపావళి ప్రత్యేక పూజలు ఘనంగా



**దుర్గి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దుర్గి మండలం కాకిరాల గ్రామ శివారులోని శ్రీ భర్మా వెంకటేశ్వరస్వామి దేవాలయంలో దీపావళి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. దాదాపు ఐదువందల సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నల్గొండ జిల్లా చందంపేట మండలం సుద్దబావి తండాకు చెందిన మహాభక్తుడు శ్రీ తులసి సాధ్ మహారాజ్ చేత ఈ ఆలయం నిర్మించబడినదిగా స్థానికులు తెలిపారు. అప్పటి నుండి ఈ ఆలయం గిరిజన సంప్రదాయ పూజా విధానాల ప్రకారం కొనసాగుతూ వస్తోంది. ఈ సంవత్సరం దీపావళి పర్వదినం సందర్భంగా తులసి సాధ్ మహారాజ్ వారసుల్లో ఏడవ తరానికి చెందిన వాంకునావోత్ బిక్కు భావోజీ (పూజారి) ప్రత్యేక పూజలను నిర్వహించారు.పూజారి బిక్కు భావోజీ మాట్లాడుతూ మా కులదైవం భర్మా స్వామివారికి దీపావళి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం మా పూర్వీకుల ఆనవాయితి. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మూడు రోజులపాటు మహా పూజ చేస్తాం అని తెలిపారు. మొదటి రోజు భర్మా స్వామివారికి పూజలు జరిపి, మరుసటి రోజు ముత్యాలమ్మ పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు. అనంతరం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన భక్తులు విరిగా పాల్గొని భక్తిరసంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

## పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పకడ్బందీగా నిర్వహించాలి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించటంతో పాటు రక్షిత తాగునీరు సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా గుంటూరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ, తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణాల్లో మంచినీటి సరఫరా, వ్యర్ధాల సేకరణ, నిర్వహణ, సాలిడ్, లిక్విడ్ వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు, మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు, వివిధ అంశాలపై ప్రజల ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో యూజీడీ పనులు, అమృత్ 1.0 ఫేజ్ 2 పనులు, పీవీకే నాయుడు అభివృద్ధి ప్రాజెక్టు, ఆర్వోబీ ప్రాజెక్టులు, ఎంటీఎంసీ పరిధిలో సీఆర్డీఏ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు అధికారులు తెలిపారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్, మున్సిపల్ సేవలు, మంచినీటి సరఫరా పై ఐవీఆర్ఎస్ ద్వారా స్వీకరిస్తున్న ఫీడ్ బ్యాక్ ను మరింతగా మెరుగుపర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న నెలరోజుల్లో పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టి వ్యర్ధాల సేకరణ, తరలింపు, కాల్వలు శుభ్రపరిచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పట్టణాల్లో వ్యర్ధాలు నిల్వ లేకుండా చేసి వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యర్ధాల నుంచి సంపద సృష్టి ప్రాజెక్టుల నిర్వహణకు చొరవ తీసుకోవాలని సూచించారు. పట్టణ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టల్స్ లో పారిశుద్ధ్యం, తాగునీరు మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈట్ స్ట్రీట్స్, స్వయం సహాయక సంఘాల స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, మురుగునీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. త్రాగునీటి నమూన ఫలితాలు రియల్ టైంలో మానిటరింగ్ చేసే సిస్టంను అమల్లోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, ఎంటీఎంసీ అదనపు కమిషనరు శకుంతల, తెనాలి మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్, నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిటి ప్లానర్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్లు వెంకటకృష్ణయ్య, శ్రీనివాస్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరులు కోటేశ్వరారావు, విష్ణుమూర్తి, వేణుగోపాల్, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనరు శ్రీకాంత్ ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# నిధుల వినియోగంలో నియోజక వర్గ సమతౌల్యం పాటించండి






**పల్నాడు జిల్లా మేజర్ న్యూస్ :** ఉపాధి హామీ నిధుల వినియోగంలో అన్ని నియోజక వర్గాల మధ్య సమతౌల్యం ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పూర్తిగా వినియోగించాలన్నారు. ఇప్పటికే మంజూరైన అన్ని పనులను గ్రౌండింగ్ చేయాలన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డ్వామా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రగతి నివేదికపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న 103 చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంపద సృష్టి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నాగార్జున సాగర్ నీటిని శుద్ధి చేసి ద్వారా జిల్లా ప్రజలకు తాగునీరు అందించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని వెటర్నరీ ఆసుపత్రుల్లో టాయిలెట్లు నిర్మించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతి బసు, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, భూగర్భ జల శాఖ ఏడీ రామ బాలజీ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకట్రావు, డీపీఓ నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసం లో 2 వ రోజు - నేడు యమునాదేవి పండుగ

**పల్నాడు జిల్లా మేజర్ న్యూస్ :** కార్తీక మాసంలో రెండవ రోజుకు ప్రత్యేకమైన విశిష్టత ఉంది, ఇది ముఖ్యంగా ఆ రోజు వచ్చే తిథి , కార్తీక మహాపురాణంలో వివరించిన కథనంపై ఆధారపడి ఉంటుంది. 1. కార్తీక శుద్ధ విదియ (రెండవ తిథి) కార్తీక మాసం శుక్ల పక్షంలో రెండవ రోజును కార్తీక శుద్ధ విదియ అంటారు. ఈ రోజుకు గల మరొక పేరు: **భ్రాతృ ద్వితీయ** (యమ ద్వితీయ లేదా భాయ్ దూజ్): ఈ రోజును యమధర్మరాజు సోదరి అయిన యమునా దేవికి సంబంధించిన పండుగగా జరుపుకుంటారు. **పురాణ కథనం:** యమునా దేవి తన సోదరుడైన యముడిని తన ఇంటికి ఆహ్వానించి భోజనం పెట్టింది. ఆ రోజున తన ఇంటికి వచ్చి భోజనం చేసిన సోదరులు ఎవరైనా అపమృత్యువు లేకుండా, నరక బాధలు లేకుండా ఉండాలని కోరింది. యముడు ఆ వరాన్ని ఇచ్చాడు. **ఆచారం:** ఈ రోజున సోదరీమణులు తమ సోదరులకు భోజనం పెట్టి, వారికి ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటారు. సోదరులు తమ సోదరీమణులకు కానుకలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు. ఈ పండుగ ఉత్తర భారతదేశంలో **'భాయ్ దూజ్'**గా, మరికొన్ని ప్రాంతాల్లో 'యమ ద్వితీయ'గా ప్రసిద్ధి చెందింది. 2. కార్తీక మహాపురాణం (రెండవ రోజు పారాయణం) కార్తీక మాసంలో ప్రతి రోజూ కార్తీక మహాపురాణంలోని ఒక అధ్యాయాన్ని పారాయణం చేస్తారు. రెండవ రోజున సాధారణంగా మొదటి అధ్యాయం లేదా రెండవ అధ్యాయం యొక్క కొనసాగింపును పారాయణం చేస్తారు. కొన్ని పురాణాల ప్రకారం, ఈ రోజున వశిష్ట మహర్షి జనక మహారాజుకు కార్తీక వ్రతం యొక్క గొప్పతనాన్ని మరియు దానిని ఆచరించవలసిన విధానాన్ని వివరిస్తారు. **శివాష్టోత్తర శతనామావళి:** కార్తీకంలో శివారాధనకు ప్రాధాన్యత ఉంది కాబట్టి, రెండవ రోజున శివాష్టోత్తర శతనామావళిని 12 సార్లు పారాయణ చేయాలని కొన్ని సాంప్రదాయాలు చెబుతాయి. 3. ఆచరించవలసిన దానాలు కార్తీక మహాపురాణం ప్రకారం, రెండవ రోజు ఆచరించవలసిన దానాల గురించి ఈ విధంగా ఉంది. **దానం:** ఈ రోజున కలువ పూలు, నూనె, ఉప్పు వంటి వాటిని దానం చేయడం వల్ల శుభం కలుగుతుందని చెబుతారు. కార్తీక మాసం రెండవ రోజు శివకేశవుల ఆరాధనకు, ప్రత్యేకంగా సోదర ప్రేమకు, బంధుత్వాలను బలపరచడానికి విశిష్టమైనదిగా పరిగణించబడుతుంది.

## ప్రాంగణ ఎంపికల్లో ఆర్.వి.ఆర్ మరియు జె.సి. ప్రతిభ




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** ఇటీవల తమ కళాశాలలో కంపైల్ ఐటీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకంలో 14 మంది ఎమ్.బి.ఏ విద్యార్థులు ఎంపికై, బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ హోదాలో 5 నుండి 6 లక్షల రూపాయల వార్షిక వేతన ప్యాకేజీ, ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు 15,000/- రూపాయల స్టైపెండ్ కూడా కంపినీ అందించడం ఆనందదాయకమని ఆర్.వి.ఆర్ మరియు జె.సి.ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. ఆధునిక వ్యాపార రంగం డిజిటల్ ఆధారిత మార్పులతో వేగంగా అభి వృద్ధి చెందుతోందని, బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యా లను అభివృద్ధి చేసుకుంటే ప్రపంచవ్యాప్తంగా అపారమైన అవకాశాలు లభిస్తా యని కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భ ంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్ కళాశాల అకడమిక్ అండ్ ఆర్ మరియు డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ మరియు అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి.శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారు లు సి.హెచ్. శ్రీనివాసరావు, డా.కె. సురేష్ బాబు, ఎమ్.బి.ఏ విభాగాధిపతి డా.టి.శ్రీకృష్ణ, కళాశాల మేనేజ్మెంట్ సైన్సెస్ విభాగ డీన్ డా.సి.హెచ్. బాల నాగేశ్వరరావు, ఎమ్.బి.ఏ విభాగ ప్లేస్‌మెంట్ ఇంచార్జి ఎన్.వినోద్ కుమార్ తదితరులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## నేడు ఎ.పి.ఎస్.పి.ఎఫ్ క్రీడల ముగింపు వేడుకలు

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఏపీ ఎస్పీ ఏఫ్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం గురువారం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగాలపూడి అనిత, హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ పాల్గొంటారు. గురువారం ఉదయం 8 గంటలకు నాగార్జున నగర్ లో జరుగుతుంది. ఈ నెల 14వ తేదీన ఏ.పి.ఎస్.పి.ఎఫ్ డైరెక్టర్ జనరల్ డా.సి.యం.త్రివిక్రమ వర్మ ఏ.పి.ఎస్.పి.ఎఫ్ 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలలో వాలీబాల్, బాడ్మింటన్, 100 మీటర్లు, 400 మీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పందేలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో రాష్ట్రంలో గల వివిధ యూనిట్ల నుండి దాదాపు రెండు వందల మంది అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ మేరకు ఎ.పి.ఎస్.పి.ఎఫ్ కార్యాలయం నుండి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## సిఐఎఫ్ నిధులు సక్రమంగా ఉపయోగించుకోవాలి

**పల్నాడు జిల్లా మేజర్ న్యూస్ :** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ – వెలుగు సిబ్బంది సమీక్షా సమావేశం లో అడిషనల్ సి ఈ ఓ శ్రీరాములు నాయుడు,అడ్మిన్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి పాల్గొని ప్రసంగించారు.. కోటప్పకొండలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణమండపం నందు వెలుగు ఏ పి ఎం లు, సీసీలకు ప్రాజెక్ట్ ప్రాధాన్యత అంశాల లపై అడిషనల్ సి ఈ ఓ శ్రీరాములు నాయుడు సమీక్ష చేయడం జరిగింది. మన డబ్బులు మన లెక్కలు ప్రతి సంఘం సభ్యులకు అవగాహనా కలిగి ఉండేలా చెయ్యాలి అని, ప్రతి 10 సంఘాలకు ఒక ఈనారి లను తయారు చెయ్యాలని అదేశించడం జరిగింది. ప్రభుత్వంచే ఇవ్వబడిన సిఐఎఫ్ నిధులు సక్రమంగా ఉపయోగించుకొని ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తగా మహిళలు తయారు అవ్వాలని చెప్పడం జరిగింది. అడ్మిన్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ మహిళందరు పీఎం ఎఫ్ఎంఈ, పీఎం ఈజిపి వంటి పథకాలు ఉపయోగించుకొని, భాద్యతాయు తముగా ఉండేలా తిరిగి రికవరీ సక్రమంగా చేసేలా వారిని తయారు చెయ్యాలని ఏపీఎం, సీసీ లకు చెప్పడం జరిగింది. అనంతరం కమ్యూనిటీ మేనేజ్డ్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి వివో ఏ లకు జరుగుచున్న శిక్షణ కార్యక్రమం లో పాల్గొని వారికి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీ రాణి,అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజాప్రతాప్,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజిని కుమారి, స్టేట్ ఆఫీస్ నుండి వాల్మీకి,శోభ, దాసు, డిపిఎంఎస్ లు, జిల్లాలోని అందరూ ఏపీఎంలో, సీసీ లు అధికారులు పాల్గొన్నారు.

# నరేంద్రనాథ్ సేవలు మరువలేనివి




**తెనాలి, మేజర్ న్యూస్ :** పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పాటిబండ్ల నరేంద్రనాథ్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ బుధవారం జరిగింది. చినరావూరులోని వాసిరెడ్డి లక్ష్మీపతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, మహిళా కమీషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, నరేంద్రనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన సేవా కార్యక్రమాలను కొనియాడుతూ ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలు వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు, జిల్లాలో వర్షాలు మేరకు జిల్లా అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. రెవిన్యూ అధికారులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరం మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పంటలు రక్షించుకునే విధంగా రైతులకు తగు సూచనలు జారీ చేయాలన్నారు. చెరువులు, వాగులు, నదులు వాటి ప్రవాహం ఆధారంగా దాటుటకు, ఈదుటకు ప్రయత్నించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, విజయ లక్ష్మి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## బి హెచ్ ఎఫ్ మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



**గుంటూరు, విద్య మేజర్ న్యూస్ :** బ్రైట్ హారిజాన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టాపురంలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఉర్దూగర్ లో జరిగిన మెగా జాబ్ మేళాకు అభ్యర్థుల నుంచి విశేష స్పందన వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు పెద్ద ఎత్తున జాబ్ మేళాలో పాల్గొన్నారు. దాదాపు 40 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఆయా అభ్యర్థులకు అర్హతలు బట్టి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇవ్వటానికి సిద్ధపడ్డాయి. ఫౌండేషన్ చైర్మన్ ఎం కె ఎస్ మొహినుద్దీన్ ఆయన బృందం జాబ్ మేళా కొరకు విశేషంగా కృషి చేశారు. గుంటూరు తూర్పు శాసనసభ్యులు నసీర్ అహ్మద్, మైనార్టీ చైర్మన్ తదితరులు కార్యక్రమానికి హాజరై అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. జాబ్ మేళాలో అర్హతలు బట్టి ఎంత చిన్న ఉద్యోగం వచ్చినా కూడా నిరాశ పడకుండా జాయిన్ అవ్వమని సూచించారు. కష్టపడటం ద్వారానే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అభ్యర్థులు వారి విధి నిర్వహణలో కష్టించి పని చేసి కంపెనీకి మంచి పేరు తేవాలని వారి లక్ష్యాన్ని కూడా గొప్పగా మలుచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో భాగంగా కొంతమంది అర్హులకు శాసనసభ్యులు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అభ్యర్థులు ఎక్కడా కూడా ఇబ్బందులు పడకుండా చక్కటి ప్రణాళికతో జాబు మేళ కార్యక్రమాన్ని రూపొందించడం వలన అభ్యర్థులు వారి వారి అర్హతలను బట్టి ఆయా సెల్ కి వెళ్లి బయోడేటాలను అందజేసి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రులు బంధువులు కూడా ఉర్దూగర్కు రావడం వల్ల పెద్ద ఎత్తున అభ్యర్థులతో ఉర్దూగర్ రెండు సమావేశ మందిరాలు కిక్కిరిసిపోయాయి. ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం ద్వారా అభ్యర్థులందరికీ సౌకర్యాలను కల్పించి ప్రశాంతంగా జాబు మేళ నిర్వహించారు. గుంటూరు తూర్పు శాసనసభ్యులు ఫౌండేషన్ నిర్వాహకులు నిర్వహించిన మెగా జాబు మేళ పట్ల అభినందనలు ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా షార్ప్ కంపెనీ సీఈఓ 40 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులను సమన్వయ పరచుకుని వాళ్ళందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చి మెగా జాబు మేళ నిర్వహణకు తోడ్పాటున అందించినందుకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# కోటి సంతకాల కు విశేష స్పందన



**ప్రత్తిపాడు మేజర్ న్యూస్ :** పెదనందిపాడు మండలం లో ప్రభు త్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా మరియు ప్రజల వైద్య ఆరోగ్య భద్రత కోసం ఎస్సీ కాలనీలో కోటి సంతకాల కార్యక్రమ ంకు విశేష స్పందన వచ్చింది. బుధవారం నిర్వహించిన కార్యక్రమం లో భాగంగా ఈ సందర్భంగా మండల వైసిపి కన్వీనర్ షేక్ కాసిం పీరా మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఆశయాల మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలను శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే అధికారంలోకివచ్చిన కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడం కాకుండా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేసి ప్రజలపై పెనుబారం మోయాలని చూస్తుందన్నారు. పార్టీ పిలుపుతో ప్రజల ఆరోగ్యం విద్యను కాపాడే ఈ పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు కురేటి భూషయ్య, కొండా కృష్ణారెడ్డి, సర్పంచ్ పద్మారావు, ఉప సర్పంచ్ దివి రాంబాబు వైఎస్ఆర్ సీపీ నాయకులు ధూళిపాల సుబ్బారావు గద్దే చెంచు రామారావు, సురేషు, సుబ్బారావు, జంపని సంజీవరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరా సంస్థ విజయానికి నిబద్ధతే మూలాధారం



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** గుంటూరు ఆటోనగర్‌లోని ఏఎస్ కన్వెన్షన్ హాల్‌లో శ్రీ భ్రమరా టౌన్‌షిప్స్ 10వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ శ్రీ భ్రమరా కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా నమస్కారాలు. ఈరోజు నాకు ఎంతో ఆనందంగా ఉంది. కేవలం కొద్ది మంది ఉద్యోగులతో ప్రారంభమైన భ్రమరా సంస్థ, వేలాది మంది కస్టమర్లు, మార్కెటింగ్ మిత్రులు, ఉద్యోగులు, డైరెక్టర్లతో ఈ స్థాయికి ఎదగడం నిజంగా గర్వకారణం. ఇది భగవంతుడి ఆశీర్వాదంతో పాటు, మీ అందరి నిబద్ధతకు నిదర్శనం. భ్రమరా అంటే క్వాలిటీ ఓవర్ క్వాంటిటీ అనే నమ్మకం. శ్రీ భ్రమరా టౌన్ షిప్ అధినేత శ్రీ గళ్ళా రామచంద్ర రావు వెనుక ఉన్న మీ అందరి బలం వలన ఈ విజయాన్ని అందుకున్నారు. భ్రమరా అంటే ఒక వ్యక్తి కాదు %–% అది ఒక టీమ్. ఈ సంస్థ యొక్క నిజమైన శక్తి మీరే అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.ఎంత ఎదిగినా కూడా ఒదిగి ఉండడం మన సంస్కారం. అదే భ్రమరా విలువ. ఏదైనా లోపం ఉంటే దాన్ని అంగీకరించి వెంటనే సరిదిద్దుకునే వ్యక్తి రామచంద్ర గారు. అటువంటి వ్యక్తి అధినేతగా ఉన్న ఈ సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తాను బలంగా నమ్ముతున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.శ్రీ భ్రమర టౌన్ షిప్ అధినేత రామచంద్ర రావుకు, సంస్థ వెనుక ఉన్న మొత్తం బృందానికి అభినందనలు తెలుపుతూ, సంస్థ మరింత విస్తరించి, అనేక కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం, సంతోషం అందించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు.

## మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకముగా కోటి సంతకాల సేకరణ



**వినుకొండ మేజర్ న్యూస్:** నియోజకవర్గం: వినుకొండ పల్నాడు జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మెంబర్ వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పిలుపు మేరకు రచ్చబండ కార్యక్రమం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణ కార్యక్రమం లో ఈపూరు మండల వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

## శ్రీశైలం పాలకమండలి సభ్యులను సన్మానించిన ప్రభుత్వ చీఫ్ విప్ జివి

**వినుకొండ: మేజర్ న్యూస్:** శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన బోడేపూడి వెంకట సుబ్బారావు మరియు శంకర శెట్టి పిచ్చయ్య ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జివి ఆంజనేయులని వినుకొండ లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోడేపూడికి, పిచ్చయ్యకి ప్రభుత్వ చీఫ్ విప్ జివి ప్రత్యేక అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ లిమక్కెన మల్లికార్జున రావు లి నాయకులు,పాల్గొన్నారు.



## పాల ఉత్పత్తిదారులకు బహుమతులు

**సత్తెనపల్లి ,మేజర్ న్యూస్ :** సంఘం పాల డైరీ కి పాలు పోసే ఉత్పత్తిదారులలో అత్యధికంగా పాలు పోసిన వారికి బహుమతులు అందించి వారిని ప్రోత్సహిస్తున్నామని డిపో 1 అధ్యక్షులు తోరటి అమరలింగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ముప్పా ళ్ళ మండలం చాగంటి వారి పాలెం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్పత్తిదారులకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పాల ఉత్పత్తిదారులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు., కార్యక్రమంలో సర్పంచ్ పీలా గాయత్రి, వైస్ సర్పంచ్ అన్నపరెడ్డి రంగారెడ్డి ,గ్రామ పెద్దలు గొలమారి వెంకట్రామిరెడ్డి ,చక్కెర లక్ష్మారెడ్డి , సంగం డైరీ సిబ్బంది సంగం డైరీ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గురజాల నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ హాస్పటల్లో చికిత్స చేయించుకుని మరియు ఆర్థిక స్తోమత లేక చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న పేద ప్రజలకు బాసటగా ఉన్న ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 51 (51చెక్కుల) మంది లబ్ధిదారులకు గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు రూ.42,34,920/- (నలభై రెండు లక్షల ముప్పై నాలుగు వేల తొమ్మిది వందల ఇరవై రూపాయలు) రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఇప్పటి వరకు 360 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా రూ. 3,80,31,487/-(మూడు కోట్ల యనభై లక్షల ముప్పై ఒక్క వేయి నాలుగు వందల యనభై ఏడు) రూపాయలు చెక్కుల రూపంలో యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు.



## నెలాఖరులోగా మెటీరియల్ అందజేయాలి: హేనీ క్రిస్టినా

**గుంటూరు మేజర్ న్యూస్:** స్టడీ మెటీరియల్ను ఈ నెలాఖరులోగా అందజేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా సూచించారు గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ చాంబర్లో బుధవారం గుంటూరు పల్నాడు బాపట్ల జిల్లా డీఈఓ లతో జరిగిన సమావేశంలో చైర్పర్సన్ మాట్లాడారు స్టడీ మెటీరియల్ను గత సంవత్సరం ఎంతమందికి పంపిణీ చేశారు ఈ ఏడాది ఎంతమందికి పంపిణీ చేస్తున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు స్టడీ మెటీరియల్ త్వరగా అందజేస్తే ముద్రించి డిసెంబర్ నాటికల్లా పాఠశాలలకు అందజేస్తామని వెల్లడించారు అదేవిధంగా పాఠశాలల్లో న్యూట్రిషన్ వసతులు సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు గత సంవత్సరం జిల్లా పరిషత్తు నుండి ఏర్పాటుచేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని ఆమె తెలిపారు ఇతర జిల్లాల నుండి కూడా స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరినట్టు వెల్లడించారు దాని ఫలితంగా పల్నాడు జిల్లా కు చెందిన విద్యార్థిని రాష్ట్రంలో అత్యధికంగా 598 మార్కులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు కార్యక్రమంలో సీఈవో జ్యోతి బస్సు గుంటూరు డిఈఓ రేణుక బాపట్ల పలనాడు జిల్లాల విద్యాశాఖ అధికారులు ఆవుల తిరుమలరావు కె ప్రభాకర్ రావు కృష్ణ నాయక్ పాల్గొన్నారు.




## షర్మిలాని మర్యాదపూర్వకంగా కలిసిన బోయపాటి రామాంజనేయులు

**వినుకొండ మేజర్ న్యూస్:** నేడు విజయవాడలోని ఆంధ్రతన భవన్ నందు ఏపీసీసీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వినుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయపాటి రామాంజనేయులు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన

**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును తగ్గించడం మరియు ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం పెంపొందించడం కోసం కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పలు అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తోంది. అక్టోబర్ నెలను జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసంగా ప్రకటించి, దేశవ్యాప్తంగా పోలీసు శాఖలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలు ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు,ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏసీ కళాశాలలో ఈ బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంను పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాల వలన కలిగే ముప్పు, మోసాలను గుర్తించే విధానం, సురక్షిత డిజిటల్ పద్ధతులు పాటించే ప్రాముఖ్యత గురించి వివరణాత్మకంగా తెలియజేశారు.




## విజయవాడ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం సెంటర్లో పిడియం ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో పచ్చని వ్యవసాయ భూముల్లో పరిశ్రమలు నిలుపుదల చేయాలని రాష్ట్ర సదస్సు కు సంబంధించి కరపత్రాన్ని పిడియం రాష్ట్ర కమిటీ సభ్యులు కే. శ్రీనివాసరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే. శ్రీనివాసరావు మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా కరేడు ప్రాంతంలో పచ్చని పంట పొలాల్లో ఇండో సోలార్ విద్యుత్ ప్లాటు, శ్రీకాకుళం జిల్లా పలాస లో కార్గో ఎయిర్పోర్ట్ ల నిర్మాణం కోసం వేలాది ఎకరాలు భూములు స్వాధీనం చేసుకొని ఆ కంపెనీలకు స్వాధీనం చేయాలని ప్రభుత్వ ప్రయత్నాలు విరమించుకోవాలని, పరిశ్రమలు ప్రవేట్ వ్యక్తులు కాకుండా నేరుగా ప్రభుత్వమే, ప్రభుత్వ భూములలో చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేగాక ఈనెల 24న ఉదయం 10 గంటలకు విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగే సదస్సు జయప్రదం చేయాలని, ఈ కార్యక్రమంలో ప్రముఖ రైతు నాయకులు, రైతు స్వరాజ్య వేదిక బాధ్యులు వడ్డే శోభనాద్రిశ్వరరావు ప్రారంభిస్తారని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పీడియం రాష్ట్ర కార్యదర్శి కే. వెంకటేష్, కార్గో ఎయిర్పోర్ట్ పోరాట కమిటీ కన్వీనర్ కొమర వాసు, పిడియం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు అని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పిడుగురాళ్లలో కరపత్రాలు ఆవిష్కరించిన వారిలో యు. వెంకటేష్ పిడిఎం సభ్యులు యు. వెంకటేష్ యు.నరసింహారావు, లక్ష్మీ, నరసమ్మ, జానకమ్మ, యు.రాధ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి ఇంటికి రావడం లేదని కుమారుడు ఆత్మహత్య

**తెనాలి, మేజర్ న్యూస్ :** తల్లి ఇంటికి రావడంలేదని కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి, మండలంలోని కంచర్లపాలెం గ్రామానికి చెందిన పందిపాటి రాజా అతని భార్య శ్యామల నెల రోజుల క్రితం ఘర్షణ పడ్డారు. శ్యామల తన పుట్టింటికి వెళ్లి ఇంటికి రావడంలేదు. మనస్థాపానికి గురైన కుబమారుడు పందిపాటి ప్రిన్స్(19) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి వైద్యశాలకు తరలించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఇంటర్ చదివి గ్రామంలోని వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తున్నాడు.